www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 7 జులై 2025

5

తూర్పుగోదావరి



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం 1100 మీ-కోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నమోదైన అర్జీల ప్రస్తుత స్థితి కూడా తెలుసుకోవచ్చునని తెలిపారు. సోమవారం అర్జీలను జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల, సచివాలయ స్థాయిలో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. meekosam.ap.gov.in పోర్టల్ లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి

- లక్ష్యం చేరుకోకపోతే వేతనం నిల్
- ఆందోళనలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి వేలాడుతోంది. దీంతో ప్రజా ప్రతనిధులను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు వేడుకుంటున్నారు. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడం తోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో



సమస్యలపై ఆందోళన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్ ఫొటో)

వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకపడుతూ వచ్చారు. ఈ విధంగా దశలవారీగా 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రాబోయే రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో టార్గెట్లను ఉపసంహరించుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం నెలకు రూ.26000 అమలు చేయాలనే డిమాండ్ ముందుకొస్తోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 25000 పని దినాలు కల్పించిన వారిని ఎ గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.11,500 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. రూ.15000 పైన పని దినాలు కల్పించిన వారిని బి గ్రేడ్‌గా పరిగణించి రూ.9,900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు, 9000లకు తక్కువగా పని దినాలు కల్పించిన వారిని సి గ్రేడ్‌గా పరిగణించి రూ.7900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు ఇస్తున్నారు. 5,000 కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. వీరిని సీనియర్ మేట్‌గా పరిగణిస్తారు. ఈ విధంగా జిల్లాలో 460 మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయినట్లు తెలుస్తోంది. ఎ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగడం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలకు మించి పనులు జరగడం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావుడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రెండేళ్లుగా వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. ఈ పరిస్థితుల్లో తమ ఉద్యోగ భద్రత కరువైందని వాపోతున్నారు. మున్సిపాలిటీలలో విలీనమైన గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం కల్పించి 200 రోజులు పని కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేయాలి. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. జూనియర్ మేట్, సీనియరల్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పరిగణించి వేతనాలు చెల్లించాలి. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలి.

-జి.సతీష్‌బాబు, జిల్లా కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్, సిఐటియు నాయకులు

పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరి విడనాడాలని, తక్షణమే పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ మిల్లులో కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు తెలిపారు. పేపర్ మిల్లులో 2020 జూలై 1 నుంచి 2023 వరకు 3.5 సంవత్సరాలకు సంబంధించిన వేతన ఒప్పందాన్ని యాజమాన్యం అమలు చేయలేదని తెలిపారు. దీనికోసం 2024 ఏప్రిల్ లో కార్మికులు 24 రోజులపాటు సమ్మె చేయగా కలెక్టర్ సమక్షంలో యాజమాన్యం వేతన ఒప్పందం అమలు చేస్తామని రాతపూర్వకంగా అంగీకరించి దాన్ని కూడా యాజమాన్యం అమలు చేయలేదని తెలిపారు. 2025 జనవరిలో మరొక దఫా నాలుగు రోజుల పాటు కార్మికులు ఆందోళన చేయగా అప్పుడు సిటీ, రూరల్, రాజానగరం ఎంఎల్‌ఎలు, జాయింట్ లేబర్ ఆఫ్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యం మరొకసారి రాతపూర్వకంగా ఒప్పందాన్ని అమలు చేస్తామని అంగీకరించిందన్నారు. కానీ నేటికీ ఆ ఒప్పందాన్ని అమలు చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. 12/3 అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల రిటైర్మెంట్ వయసు 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పొడిగిస్తూ చేసిన అగ్రిమెంట్ అమలు చేయకుండా 58 ఏళ్లకు రిటైర్మెంట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులు నివసిస్తున్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నా వాటికి ఏమాత్రం మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేసి, ఆ క్వార్టర్స్ స్థలాలను అమ్ముకోవాలని యాజమాన్యం ప్రయత్నం చేయడం సరికాదన్నారు. చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతున్న యాజమాన్యం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జులై 5 నుంచి మిల్లులో కార్మికులు నిరవధిక ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.పూర్ణిమరాజు, నాయకులు సోమేశ్వరరావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

గోదావరిలో వరద పరవళ్లు

- 2,18,257 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి -కొవ్వూరు

దిగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో గడిచిన నాలుగు రోజుల నుంచి వరద నీరు క్రమంగా పెరుగుతోంది. గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. 2,25,676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్టు గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్ తెలిపారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద 122 గేట్లు ఎత్తి 2,18,257 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో సాగునీటి అవసరాల నిమిత్తం 12,450 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. తూర్పు డెల్టాకు 4200, సెంట్రల్ డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 5800 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలంలో 18.50 అడుగుల నీటిమట్టం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. ఎగువ ప్రాంతంలో గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ఉధతి మరో రెండు మూడు రోజులు కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి వరద నీరు

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్

ప్రజాశక్తి-పెరవలి

లయన్స్ క్లబ్ సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థ అని మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసించారు. దీపిక కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ప్రాంతంలో, రాష్ట్రంలో, దేశంలో లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. అనంతరం జూనోసిస్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన పశు దంత వైద్య శిబిరాలను ప్రారంభించారు. భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎవి.రామరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. రోగులు వైద్యులతో మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రాయుడు దంపతులు సమాజానికి సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషం అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రవళి స్పిన్నర్స్ జెఎండి వంకా రాజ్‌కుమార్, గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నిడదవోలు రూరల్

గోపవరంలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహాన్ని ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, గోపవరం గ్రామ సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, ఆరేపల్లి చిన్న నంగాలు పాల్గొన్నారు.



ఆర్‌టిసి డిపో వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ఆర్‌టిసి డిపోలో సిబ్బంది కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని డిపో సౌకర్యాల సాధన పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ బదిలీ అయిన డిఎం స్థానంలో మరొకరిని భర్తీ చెయ్యలేదని, కండక్టర్లు, డ్రైవర్లు బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారు రాకపోవడం వల్ల కొన్ని సర్వీసులు రద్దు చేశారని తెలిపారు. విశాఖపట్నం సర్వీస్ రద్దు చేసి, పల్లె వెలుగు బస్సులు రద్దు చెయ్యడం ద్వారా విద్యార్థులు ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటి కృష్ణ, జి.డానియల్, అంబటి పుల్లారావు, యూసఫ్ షాహీ పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు కోసం జులై 9న సార్వత్రిక సమ్మెను కార్మికులంతా పాల్గొని జయప్రదం చెయ్యాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద గల ఎఐటియుసి కార్యాలయంలో ఆదివారం కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కోండ్ల రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర్లు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని, దీన్ని కార్మికవర్గం ఏకతాటిపై నిలిచి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి, ఐఎఫ్‌టియు నాయకులు అప్పారావు, ఎఐటిసి నాయకులు వి.కొండలరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

'మానవత' ద్వారా సమాజ సేవ

ప్రజాశక్తి-తాళ్లపూడి

అన్ని వర్గాల ప్రజలకూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తులకూ సేవ చేయాలనుకునే వారికి మానవత సేవా సంస్థ ఒక మార్గం వంటిదని ఆ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు అన్నారు. తాళ్లపూడిలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన మానవత సేవా సంస్థ సర్వసభ్య సమావేశంలో భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాజీ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో చేసిన కార్యక్రమాలను వివరించారు. మానవత సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధన రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవా సంస్థ నూతన అధ్యక్షునిగా వెలుగుబంటి శ్రీనివాస్, కార్యదర్శిగా సనపల రాజశేఖర్, కోశాధికారిగా అప్పన హనుమంత రావు, కార్యవర్గ సభ్యులుగా టి.దోసాలు, పి.దుర్గాప్రసాద్, టి.పోసారావు, టి.రామ్మోహన్, ఐ.సత్యనారాయణ, ఎం.రమాదేవి ఎన్నికయ్యారు..

దేశానికి రైతులు వెన్నెముక

ప్రజాశక్తి-నల్లజర్ల

దేశానికి వెన్నెముక అయిన రైతు బాగుండాలంటే పరిపాలనా వ్యవస్థ సక్రమంగా ఉండాలని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం స్థానిక స్టార్ గ్రాండ్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎఎంసి చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మద్దిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యుడు మితవాది ప్రజా సేవకుడు రైతు బాంధవుడు యద్దనపూడి బ్రహ్మ రాజును మార్కెట్ యార్డ్ అధ్యక్షునిగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంపీ పురందరేశ్వరి మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా వ్యవసాయ శాఖ అభివద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంఎల్‌ఎ వెంకటరాజు మార్కెట్ యార్డ్ చైర్మన్ బ్రహ్మరాజుకు గజమాలలతో ప్రజలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆరుమల్లి రాధాకృష్ణ, ఎలమాటి శ్రీనివాసరావు, పసుమర్తి సతీష్, జమ్మల వీర వెంకట సతీష్, కండిపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.



గజమాలతో ఆహ్వానిస్తున్న ప్రజలు

రజకుల చెరువు పునఃప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం రజకుల పేటలోని రజకుల చెరువును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పున్ణ ప్రారంభించారు. చెరువులో పూడుకుపోయిన మట్టిని తొలగించి చెరువును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి శేషారావు, టిడిపి మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, బాలాజీ, పాల్గొన్నారు.

చిలుకూరికి ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావును అభినందిస్తూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసా పత్రాన్ని అందించారు. ఆదివారం రాజమహేంద్రవరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం జారీ చేసిన సర్వీస్ పత్రాన్ని అందజేశారు. యోగాంధ్రప్రదేశ్ యోగా శిక్షణ కార్యక్రమాల్లో ఎక్కువ మందిని ఎన్‌రోల్ చేయడంలో శ్రీనివాసరావు విశిష్ట సేవలు అందించారనిఅభినందించారు.




ఆస్తి పత్రాలను అందజేస్తున్న గంధంవిజయశ్రీ, శేష సాయి కుటుంబ సభ్యులు

షిరిడీసాయి కేంద్రానికి రూ.కోటి భవనం విరాళం

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలో షిరిడీ సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రానికి పట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది పడాల భాను ప్రసాద్, విజయశ్రీ దంపతులకు చెందిన 256 గజాల్లో ఉన్న రెండంతస్తుల భవనాన్ని విరాళంగా అందజేశారు. సుమారు రూ.కోటి విలువైన ఆస్తిని ఆధ్యాత్మిక కేంద్రానికి చెందే విధంగా 2020లో వీలునామా రాశారు. తమ తనంతరం ఈ భవనాన్ని ఆధ్యాత్మిక అవసరాల నిమిత్తం వినియోగించాలని వీలునామాలో పేర్కొన్నారు. దంపతులు ఇద్దరూ మృతి చెందడంతో విజయశ్రీ సోదరుడు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గంధం శేష సాయి, ఇతర కుటుంబ సభ్యులు కలిసి ఆదివారం వీలునామా పత్రాలను ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకులకు అప్పగించారు. పట్టణంలో గోష్పాద క్షేత్రంలోని షిరిడీ సాయి ఆలయంలో ఆదివారం వీటిని అందజేశారు. ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకులు గుడివాక శ్రీనివాస్, కసిరెడ్డి సీతారామయ్య, దోర్బల ప్రభాకర్ శర్మ, చనమల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జూనోసిస్ డే సందర్భంగా ఉచిత వ్యాక్సిన్లు

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోసమవారం జిల్లావ్యాప్తంగా ర్యాబిస్ వ్యాక్సిన్లు వేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జులై 12వ తేదీ వరకూ ర్యాబిస్ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ర్యాబిస్ ప్రధానంగా కుక్కల నుంచి వ్యాపించే ప్రాణాంతక వ్యాధి అన్నారు. ర్యాబిస్ వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు, జగదీష్, గుర్రే రాజు, వైఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానిక పశువుల ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పశు సంవర్ధక శాఖ ఎడి ఎ.వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు, పరిమి హరిచరణ్ పాల్గొన్నారు.

కడియం టిడిపి రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ కడియం ఏరియా పశు వైద్యశాలలో పాల్గొన్నారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఆసుపత్రి ఎడి డాక్టర్ జి.రవివర్మ, జేగురుపాడు, పశువైద్యాధికారులు డాక్టర్ జెఎస్ఆర్.రవి కిరణ్, డాక్టర్ బి.భరత్, డాక్టర్ హేమంత్, సుబ్బారావు, రాజు, సురేష్, జ్యోతి, సమత, శాంతి ప్రియ, వెంకటలక్ష్మి, కుసుమ, రవికుమార్, అఖిల్, జ్యోతి, పాల్గొన్నారు.

చాగల్లులో లయన్స్ క్లబ్ సహకారంతో కుక్కలకు ఉచితముగా రాబీస్ వ్యాధి టీకాలు వేసినట్టు డాక్టర్ యు.ముకేశ్ తెలిపారు. పశువైద్యాధికారి డాక్టర్ ఉర్రింకల ముఖేష్, వైద్యాధికారి డాక్టర్ టి.మనోజ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వల్లిపల్లి వెంకట రామారావు, కోడి శ్రీనివాసరావు, కోడి నాగేశ్వరావు, కోడి సూర్యప్రకాశరావు, కె.అచ్యుత రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



కొవ్వూరులో వ్యాక్సిన్లు వేస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

నిడదవోలు జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. వైసిపి కౌన్సిలర్లు, పలువురు పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు దున్నా దుర్గారావు పైడిమెట్టలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గెడ్డం వినోద్, జి.రాజు, బి.భాస్కరరావు, పి.పుష్పరాజు, జి.గణేష్, జి.గాంధీ, విజేత పబ్లిక్ స్కూల్ హెచ్ఎం డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్, కె.రమేష్, ఎన్.బన్నీ, జి.రాజు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం కాల్దారిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, ఈర్పిన సత్యనారాయణ, కోమట్లపల్లి విశ్వనాథం, చెట్టే సృజన రావు, ఎంపిపి చెట్టే నవీన్, చెట్టే సర్వేశ్వరరావు, కోమట్లపల్లి బిమ్మన, కరుటూరి కృష్ణారావు పాల్గొన్నారు.

కొవ్వూరు మెరక వీధిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

కానూరులో లయన్స్ క్లబ్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యాన రమా గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ పుల్లూరి అశోక్ కుమార్, ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సుఖీభవ చిన్నపిల్లల హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మహిళా వైద్యనిపుణులు డాక్టర్ సిహెచ్.పావని, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.చైతన్య, ఎముకల శాస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్రరావు 130 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావన మధు పూర్ణ చందు, బురుగుపల్లి రాజు, అమ్మ ఫౌండేషన్ రాము, బండారు నవీన్ కుమార్ పాల్గొన్నారు

తాళ్లపూడిలో 'మోసం గ్యారంటీ..'

ప్రజాశక్తి-తాళ్లపూడి

బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్తా గ్రామాల్లోని ప్రజల వద్దకు తీసుకువెళ్లి విజయవంతం చేయాలని కార్యక్రమ పరిశీలకులు గొందే శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం తాళ్లపూడిలో వైసిపి మండల అధ్యక్షుడు కొలిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకువెళ్లడంతోపాటు అధికార ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, వైసిపి నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, గూడా విజయరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న పదిమంది అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని గజ్జరం గ్రామంలో పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేయడం జరిగిందని తాళ్లపూడి ఎస్సై టి రామకష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,340 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారు.

గొల్లప్రోలులో...

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంక నామావారి వీధిలో విద్యుదాఘాతంతో ఒక తాటాకు ఇల్లు దగ్ధం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కోలంక నామవారి వీధిలో నివాసం ఉంటున్న కొడగాల వెంకటేశ్వర్లుకు చెందిన తాటాకు ఇంటికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.దీంతో స్థానికులు కాకినాడ అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా తెలియచేశారు. అగ్నిమాపక శకటం వచ్చే సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఫైర్ సిబ్బంది చుట్టుపక్కలకు మంటలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేశారు. ఈ తాటాకు ఇంటిలో వెంకటేశ్వర్లు, చిన్న కుమారుడు వీరబాబు నివాసం ఉంటున్నారు. ఇంటిలో గల సామాగ్రి పూర్తిగా తగలబడడంతో ఆ కుటుంబాలు కట్టుబట్టలతో ముగిలారు. ఈ ప్రమాదంలో నష్టం రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు జిల్లా సహాయ ఫైర్ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

పశు మాంసం తరలిస్తున్న వారిపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పశు మాంసాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుర్తి గ్రామ శివారులో గోవధ జరుగుతుందన్న సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, విఆర్ఒ ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక ట్రక్ లో సుమారు 1000 కేజీల పసుమాంసంను స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రక్ ఆటో, నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

శుక్రవారం పట్టణంలో బైపాస్‌లోని దాబా వద్ద జరిగిన హత్యాయత్నం కేసు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణానికి చెంది న జ్యోతుల రాంబాబు, ఊట దుర్గాప్రసాద్‌లను శని వారం రాత్రి స్థానిక టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ రామకృష్ణ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

33 కెవి వైర్లపై పడిన కోతి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం పుష్కర పంపు హౌస్ పవర్ స్టేషన్ వద్ద 33 కెవి వైర్లపై కోతి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని సుమారు 10 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9 గంటల వరకూ విద్యుత్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ పి.మాధురి వివరణ ఇస్తూ 220 కెవి బ్రేకర్ పాడవడంతో అంతరాయం ఏర్పడిందని, పెద్దాపురం నుంచి విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

తాళ్లరేవు మండలం జార్జిపేట ఎంఎల్‌కె నగర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఆదివారం జరిగింది. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శీలి రాజు, మోర్త సతీష్, మోర్త నాగేష్, మందపల్లి నాగార్జున, మందపల్లి నాగేష్, పలివెల మరియదాస్, కూర్మాన అబ్రహం పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం పట్టణంలోని కొండయ్యపేటలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మందపల్లి రుద్రయ్య, లంక నాగభూషణం, దొండపాటి సుదర్శనరావు, కోమారపు జయరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

గండేపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ తయారు చేయించిన సుపరిపాలన తొలి అడుగు ప్రచార రథాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు తెలియజేయాలని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ పాల్గొన్నారు.

ఇంటింటికీ సుపరిపాలన తొలి అడుగు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూటమి ఏడాది పాలనపై చేసపట్టిన సుపరాపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం కొనసాగింది. పలు ప్రాంతాల్లో ఎంఎల్ఎలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాల అమలుతీరును వివరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ పక్కా గృహాలను నిర్మిస్తామని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం మండలంలోని రమణయ్యపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ స్తులు తమకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించాలని కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు కూటమి ప్రభుత్వం ఇళ్లను కేటాయిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి విఎస్ఎన్.రాజేష్, జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, చిక్కాల లక్ష్మణరావు, బస ప్రసాద్, కోరుకొండ నూక రాజు, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని మల్లేపల్లి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల భాస్కరరావు, ఎస్‌విఎస్.అప్పలరాజు, తెలగ రెడ్డి భద్రరావు, బలిరెడ్డి గంగరాజు, సుంకవల్లి రాజు, దిడ్డి చిన్న శ్రీను, కొల్లి త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పవర, పండ్రవాడ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, ఆకునూరి సత్తిబాబు, తోటకూర శ్రీనివాస్, పెంకె వెంకటేష్, చీకట్ల వెంకటేష్ , అద్దాల వెంకన్నబాబు, నర్ల వెంకటరమణ ,ముమ్మిడి సోమరాజు, పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధికి చెందిన కరపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామర్లకోటలో ఎంఎల్ఎ చినరాజప్ప



ఏలేశ్వరంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ



గండేపల్లిలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

ఆరోగ్యకరమైన జీవనం కోసం టీకాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు స్థానిక పశువుల ఏరియా ఆసుపత్రి వద్ద ఉచితంగా యాంటీ రాబిస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు, పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు, దుర్గాడ, పశు వైద్యులు టి.శ్రీకాంత్, డి.శ్రీనివాస్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్వా చిట్టిబాబు, గరగ తాతాజీ బలిరెడ్డి గంగబాబు, మొగలి రామ్మూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** భీమేశ్వర లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలోఉచిత వ్యాక్సిన్ పంపిణీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ క్లస్టర్ ఆసుపత్రి ఆవరణలో దాత సత్యవోలు వీరవెంకట సూర్యనారా యణమూర్తి రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన రోగుల వేచి ఉండే ఒపి షెడ్, మంచినీటి ప్లాంట్‌ను చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్, జిల్లా ఛైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు బాబీ, కోశాధికారి ఏలేటి రమేష్, క్లబ్ నాయకులు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పివి.వరప్రసాద్, పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.ప్రమీల, మండల పశువైద్యాధికారి భవానీ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. **జగ్గంపేట** ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.తాతయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధికానికి టీకాలు వేశారు.



సామర్లకోటలో ఎంఎల్ఎ చినరాజప్ప



గొల్లప్రోలులో టీకా వేస్తున్న వైద్యులు

మరిడమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి జాతరకు ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు తరలి వచ్చారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. క్యూలైన్లో ఉన్న వారికి మంచి నీరు, వారి పిల్లలకు వేడి పాలు అందజేశారు. ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. యాత్రి కులకు పలు స్వచ్ఛంధ సంస్థలు పులిహార, దద్దోజనం, పిల్లలకు పాలు పంపిణీ చేశారు.



సందడిగా మరిడమ్మ ఆలయం

రంపచోడవరం టిడిపి పరిశీలకునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

టిడిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కెఎల్‌బి ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ఛైర్మన్ కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసిందని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ అధిష్టానం నియోజకవర్గాల పరిశీలకును నియమించిందని తెలిపారు. ఇందులోభాగంగా తనను రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులుగా నియమించడం సంతోషకంగా ఉందన్నారు. ఈపదవి తన బాధ్యతలను మరింతగా పెంచిందన్నారు. ఎంఎల్ఎ మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గంలో తన విధులను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఉత్సాహంగా ఈత పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

జిల్లా క్రీడా మైదానంలో 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జాతీయ మార్తాన్ స్విమ్మర్ గోలి శ్యామల పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఈ పోటీల్లో గ్రూప్ వన్ బాయ్స్ విభాగం నుంచి కె.వీరశివకృష్ణ, ఎం.గోకుల కన్నా, కె.ముత్యాలముఖేష్, వి.మణికంఠనవీన్, టి.దుర్గేష్, గ్రూప్ వన్ గర్ల్స్ విభాగంలో పి.సహస్రశ్రీ, గ్రూప్ టు బాయ్స్ విభాగంలో, టివిసి.సాయిసాకేత్, పి.కౌశిక్‌వర్ధన్, ఎస్.మిచిల్‌అర్జున్, ఎ.అభిసాయి, వై.గౌతమ్, ఎ.అక్షిత్, వీరాజ్‌విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్, గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సిహెచ్.హిమజ్యోతి, కె.తనుశ్రీ, గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో కె.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.షణ్ముఖ్వీర్, ఎం.సాయిచరణ్, జి.భువనేష్, జి.రోబిన్, గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్.గుల్బర్, జి.అన్విధ, ఎం.పల్లవి, ఎం.ఆశ్విని ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీలో పాల్గొంటారు. సిమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకటశివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ కోచ్ డి.శ్రీనివాస్, కోచ్‌లు ఎం.అజయ్‌కుమార్, పి.ఎ.నాయుడు, వి.వీరభద్రయ్య, ఎల్.రాకేష్, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు

యాజమాన్యం హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - సామర్లకోట

రాక్ సిరామిక్స్ పరిశ్రమలో 90 మంది కార్మికులకు ఈనెల 10వ తేదీ నుంచి వేరే సెక్షన్‌లో పని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు శనివారం రాత్రి పదిన్నర గంటలకు ఆందోళన విరమించారు. శనివారం ఉదయం ఫ్యాక్టరీ యాజమాన్యం 90 మంది కార్మికులను తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో కార్మికులు ఫ్యాక్టరీ లోపల వర్క్ షెడ్‌లో ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. తమను ఉద్యోగాల నుంచి తొలగించమని స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. దీంతో హెచ్ఆర్ ప్రతినిధులు సోమ, మంగళ, బుధవారం సెలవుల అనంతరం విధులకు హాజరు కావాలని, వేరే సెక్షన్‌లో 90 మంది కార్మికులకు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆందోళన విరమించారు. అయితే హెచ్ఆర్ ప్రతినిధులు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారా? లేదా? అనేది గురువారం తెలియనుంది.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని దండు పుంతలో దృష్టి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం షారోన్ ప్రేయర్ హాల్ పాస్టర్ జాషువా గిరి, షారోన్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ జాషువా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి చూపు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయుడు అనిల్, యాదగిరి సత్యనారాయణ, జనసేన నాయకులు కుడిపూడి బాలాజీ, వైసిపి నాయకులు నల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ద్వారా ప్రాణదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆరోగ్యవంతమైన యువత రక్తదానం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక దర్గాపేటలో బాధ్యత ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మన ఇల్లు' సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ చినరాజప్ప జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు భారిన పడిన వారికి అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు 'మన ఇల్లు' సంస్థ పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన ఇల్లు వ్యవస్థాపకుడు ఎవివి.సత్యనారాయణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొరుపూరి రాజు, టిడిపి పట్టణ కార్యదర్శి తూతిక రాజు, డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, ఎస్ఐ వి.మౌనిక, రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మణికర్ణిక బృందం రక్తదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మణికర్ణిక బృందం హైదరాబాద్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఆదివారం మేడిది సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో మెగా బ్లడ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరంలో తమ బృందం నుంచి 13 మంది రక్తదానం చేసినట్లు మణికర్ణిక యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష స్థానిక విలేకరులకు తెలిపారు. అనంతరం మేడిద సుబ్బయ్య ట్రస్ట్ ఛైర్మన్ జ్ఞాపికను ఇచ్చి సత్కరించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు శ్రీనివాస్, చిక్కాల మణికంఠ, వీరబాబు, స్వామి, వంశీ, అనిల్, ప్రసాద్, మణి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో అధికారుల నియామకం

ప్రజాశక్తి - కాకినాడ

పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఉపకులపతి ప్రొ. సిఎస్ఆర్‌కె.ప్రసాద్ ఆదేశాలతో జెఎన్‌టియుకె పలువురు అధికారులు నియమితులయ్యారు. యుసిఇకె ఇఇఇ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ. ఆర్.శ్రీనివాసరావును ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ.వి.రవీంద్రనాథ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. అదేవిధంగా జెఎన్‌టియుకె యుసిఇకె మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొ.వి.వి.సుబ్బారావును ఇన్‌ఛార్జ్ రెక్టార్‌గా నియమించారు. ఇప్పటివరకు రెక్టార్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ.కెవి.రమణను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొ. ఆర్.శ్రీనివాసరావును, ఇన్‌ఛార్జ్ రెక్టార్‌గా నియమితులైన ప్రొ.వి.వి.సుబ్బారావును ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్, ఒఎస్ ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యూనివర్శిటీ అధికారులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందించారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కుటుంబ సభ్యులకు డాక్టర్ ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్‌లోని సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇసిజి, 2డి ఎకో, స్కానింగ్, వివిధ రకాల రక్త పరీక్షలు, బిపి, షుగరు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.ఓబుల్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ మల్లిడి భార్గవి వైద్య సేవలు అందించారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య సేవలు అందించిన ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ ఆసుపత్రి యాజమాన్యానికి జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఎర్రబారిన గౌతమీ గోదావరి నది

ఎర్రబారిన గౌతమీ గోదావరి

ప్రజాశక్తి - యానాం

శనివారం వరకూ నీలి రంగు జలాలతో కనువిందు చేసిన గోదావరి నది ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఆదివారం ఒక్కసారిగా ఎర్రబారింది. గోదావరికి ఏటా జూన్ నెలలో వరద రావడం నీరు అరుణవర్ణం దాల్చడం ఆనవాయితీ. వరద నీటితో కొత్తందాలను సంతరించుకున్న గోదావరిని చూసేందుకు ఆదివారం రాజీవ్ బీచ్‌కు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక భీమ్ నగర్, రాజీవ్ బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, కొల్లు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలీని మహిళ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప ఐస్ ఫ్యాక్టరి సమీపంలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. మహిళా మృతదేహం గోదావరిలో కొట్టుకొచ్చినట్లు తెలిపారు. ఎర్రటి దుస్తులు ధరించి గుర్తు పట్టని స్థితిలో ఉందన్నారు. ఆమెకు 40 నుంచి 50 సంవత్సరాలు మధ్య వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆదిత్యలో ఎన్‌సిసి క్యాంపు విజయవంతం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సిసి క్యాంపు విజయవంతంగా ముగిసిందని 18 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ క్యాంపులో కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలలు కళాశాలల నుంచి 570 మంది పాల్గొన్నారని తెలిపారు. క్యాంపులో రక్తదానం, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్, దేశభక్తి, దేశ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆదిత్య యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.